సాక్షి అనకాపల్లి

శనివారం । 1 । జూన్ । 2024



లలితా పీఠంలో చండీ హోమం

విశాఖ: శ్రీలలితా పీఠంలో వైశాఖ మాసం, బహుళ అష్టమి సందర్భంగా శుక్రవారం ఉదయం చండీహోమం ఘనంగా నిర్వహించారు.



తులసికి నివాళి

విశాఖ: దివంగత అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకురాలు తులసికి ఐసీడీఎస్ సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.0/30.0

ఉష్ణోగ్రతలు 2-4 డిగ్రీలు పెరుగుతాయని, తేలిక పాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం తెలిపారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

- జిల్లాకు రూ.77 కోట్ల సొమ్ము విడుదల

తుమ్మపాల: జిల్లాలో జూన్‌లో పింఛన్ పంపిణీకి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల కూడా లబ్ధిదారుల ఖాతాల్లో పింఛన్ సొమ్ము జమ చేయనుంది. వికలాంగులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారు, మంచానికే పరిమితమైన వారు, చక్రాల కుర్చీ సాయంతో ప్రయాణం చేసే వారు, యుద్ధవీరుల వృద్ధ వితంతువులకు, మేలో వివిధ కారణాలతో బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కాని వారికి, జూన్ 1 నాటికి 80 ఏళ్లు పైబడిన వారికి ఇళ్ల వద్దనే ప్రభుత్వ యంత్రాంగం ద్వారా పింఛను డబ్బులు అందజేస్తారు. కాగా.. జిల్లాలో 2,64,526 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా.. వీరికి రూ.77 కోట్ల 4 వేలు విడుదలైనట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.శచిదేవి తెలిపారు. డీబీటీ(లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలు) ద్వారా 1,93,349 మందికి రూ.58 కోట్లు 51 వేలు, డోర్ టు డోర్‌లో 71,177 మందికి 18 కోట్ల 99 లక్షల 53 వేలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

గుర్తింపులేని పాఠశాలల వివరాలు బహిర్గతం చేయండి

- విద్యాశాఖకు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశం

తుమ్మపాల: జిల్లాలో గుర్తింపులేని అన్ని విద్యా సంస్థల వివరాలు 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే బహిర్గతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారికి ఆదేశాలు జారీ చేసినట్టు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. గుర్తింపు లేని పాఠశాలల వివరాలు తెలుసుకోవడం బాలల హక్కు అన్నారు. ఇటువంటి పాఠశాలల్లో చేర్పించడం వల్ల పిల్లల భవిష్యత్ అగమ్యగోచరమే కాకుండా తల్లిదండ్రులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేసిన వారవుతారని అన్నారు. అటువంటి పాఠశాలల వివరాలు ప్రసార, ప్రచార మాధ్యమాలు, ఇతర సోషల్ మీడియా ద్వారా అందరూ తెలుసుకునేలా బహిర్గతం చేస్తూ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గుర్తింపు పొందేందుకు తాత్సారం చేసే పాఠశాలలపై చట్టప్రకారం చర్యలతోపాటు క్రిమినల్ కేసులు పెట్టేందుకు వెనుకడుగు వేయొద్దన్నారు. తల్లిదండ్రులు అటువంటి పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించకూడదని సూచించారు.


విద్యుత్ షిఫ్టు ఆపరేటర్ తొలగింపు

- టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కొమర శేష



దేవరాపల్లి: నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బోయిలకింతాడ విద్యుత్ సబ్‌స్టేషన్ షిఫ్టు ఆపరేటర్ కొమర శేషుపై వేటు పడింది. అతన్ని విధుల నుంచి తొలగిస్తూ అధికారులు చర్యలు తీసుకున్నారు. బోయిలకింతాడకు చెందిన కొమర శేషు టీడీపీ నాయకులతో కలిసి ఆ పార్టీకి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నారు. దీనికి సంబంధించి ఫోటోలు, వీడియోలతో సహా స్థానికులు రాష్ట్ర ఎన్నికల కమిషన్, కలెక్టర్, నియోజకవర్గ ఆర్వోకు మే 15న ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక అధికారులు సమగ్ర విచారణ జరిపారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం వాస్తవమని ధ్రువీకరించి.. గత 27న విధుల నుంచి శాశ్వతంగా తొలగించారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందిందని విద్యుత్ ఏఈ కె.శంకరరావు తెలిపారు.

ఐదో రోజు పాలిసెట్ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

తుమ్మపాల: పాలిసెట్-2024 కౌన్సెలింగ్ ప్రక్రియ రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఐదో రోజు శుక్రవారం చురుగ్గా జరిగింది. 59,001 నుంచి 75,000 ర్యాంకు విద్యార్థులు తమ ధ్రువపత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. 75 మంది బాలురు, 55 మంది బాలికలు మొత్తం 130 మంది హాజరయ్యారని కోఆర్డినేటర్, కళాశాల ప్రిన్సిపల్ ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం జరిగే కౌన్సెలింగ్‌కు 75,001 నుంచి 92,000 ర్యాంక్ పొందిన విద్యార్థులు హాజరవ్వాలని ఆయన తెలిపారు.

వడదెబ్బకు వృద్ధుడు మృతి

కశింకోట: స్థానిక హౌసింగ్ కాలనీలో శుక్రవారం వడదెబ్బకు గురై వృద్ధుడు మృతి చెందాడు. గొలుగొండ రాము (60) తన ఇంటి వద్ద ఎండ తీవ్రతకు వడదెబ్బకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

- ఉక్కపోతకు ఎండవాత కూడా తోడు
- మరో మూడు రోజులు తప్పని అవస్థలు
- గాలిలో అధిక తేమ శాతమే కారణం
- అవిశ్రాంతంగా తిరుగుతున్న ఫ్యాన్లు, ఏసీలు

ముచ్చెమటలు.. ముప్పతిప్పలు!



పెరిగిన ఉష్ణోగ్రతలతో జనసంచారం లేక నిర్మానుష్యంగా మారిన చోడవరం మెయిన్‌రోడ్డు (ఇన్‌సెట్) ఓ కుటుంబం అవస్థల ప్రయాణం



ఎండలో మామిడి పళ్లు అమ్ముతున్న మహిళల అవస్థలు

సాక్షి, విశాఖపట్నం: నైరుతి రుతుపవనాలు ఆగమనం, రోహిణి కార్తె నిష్క్రమించే వేళ ఉక్కపోత, ఎండవాత ఏకమై జనాన్ని అవస్థల పాల్జేస్తున్నాయి. రేయింబవళ్లు ముచ్చెమటలు పోయిస్తూ ముప్పతిప్పలు పెడుతున్నాయి. ఒక పక్క వడగాడ్పులు వీస్తుండగా, మరోపక్క ఉక్కపోత ఊపిరి సలపనీయడం లేదు. ఉదయం నుంచి అర్ధరాత్రి దాటినా పరిస్థితిలో ఏ మాత్రం మార్పు ఉండడం లేదు. అన్ని వయసుల వారూ చెమటతో తడిసి ముద్దవుతూ తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీంతో ప్రతి ఇంట్లోనూ 24 గంటలూ ఫ్యాన్లు, ఏసీలు అవిశ్రాంతంగా తిరుగుతూనే ఉన్నాయి. అయినప్పటికీ ఉక్కపోత, చెమటల నుంచి ఉపశమనం లభించడం లేదు. ఇంట్లో ఉన్నా, పనులపై బయటకు వచ్చినా జనం ఉక్కిరిబిక్కిరి అవుతూనే ఉన్నారు. గడిచిన కొన్నేళ్లలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదని వాతావరణ నిపుణులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితికి గాలిలో తేమ అధికంగా ఉండటమే కారణమని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం కొద్ది రోజుల నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాలో గాలిలో తేమ 70-80 శాతం వరకు నమోదవుతోంది. శుక్రవారం ఇది మరింత అధికమైంది. గాలిలో తేమ వాల్తేరులో 80 శాతం, విశాఖ ఎయిర్‌పోర్టులో 81 శాతం రికార్డయింది. ఫలితంగా ఇటీవల రోజులకంటే శుక్రవారం ఉక్కపోత తీవ్రత మరింత అధికంగా కనిపించింది. రానున్న రెండు, మూడు రోజులు కూడా ఇదే పరిస్థితి కొనసాగనుంది.

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉష్ణోగ్రతలు

జిల్లా	ప్రాంతం	ఉష్ణోగ్రత
అనకాపల్లి	రావికమతం	42.1
అనకాపల్లి	కోటవురట్ల	41.8
అనకాపల్లి	మాకవరపాలెం	41.8
అనకాపల్లి	రోలుగుంట	41.3
అనకాపల్లి	కె.కోటపాడు	40.8
అనకాపల్లి	చోడవరం	40.8
అనకాపల్లి	దేవరాపల్లి	40.8
అనకాపల్లి	అనకాపల్లి	38.0
విశాఖపట్నం	పెందుర్తి	39.4
విశాఖపట్నం	ఆనందపురం	41.8
విశాఖపట్నం	పద్మనాభం	41.8
విశాఖపట్నం	విశాఖ రూరల్	39.0

కొనసాగుతున్న ఉష్ణతాపం

మరోవైపు ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉష్ణతాపం కొనసాగుతూనే ఉంది. గరిష్ట ఉష్ణోగ్రతలు 40-44 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. ఫలితంగా కొన్ని ప్రాంతాల్లో వడగాడ్పులు వీస్తున్నాయి. ప్రధానంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో వీటి ప్రభావం ఎక్కువగా ఉంది. శుక్రవారం అల్లూరి జిల్లా కూనవరంలో అత్యధికంగా 44 డిగ్రీలు, అనకాపల్లి జిల్లా రావికమతంలో 42.1, విశాఖపట్నం జిల్లా ఆనందపురం, పద్మనాభం మండలాల్లో 41.8 డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.



ఎండ మండుతున్నా ఆగని బతుకు పోరాటం

బాబోయ్ ఎండలు

చోడవరం: సూర్యుడు విశ్వరూపం చూపిస్తుండటంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. కొన్ని రోజులుగా సాయంత్రం సమయంలో ఓ మోస్తరు వర్షాలు కురవడంతో కాస్త వాతావరణం చల్లబడగా.. గురు, శుక్ర వారాల్లో ఒక్కసారిగా ఎండ భగ్గుమంది. చోడవరం పరిసరాల్లో శుక్రవారం 40.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో జనం రోడ్లపైకి రాలేని పరిస్థితి ఏర్పడింది. మరోపక్క పెరిగిన ఉష్ణోగ్రతలకు వడగాల్పులు తోడవ్వడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చోడవరం పట్టణంలో ఉదయం 10 గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. భవన నిర్మాణ కార్మికులు, ఉపాధి కూలీలు తమ పని వేళలను ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు మార్పులు చేసుకున్నప్పటికీ.. ఆ సమయాల్లో సైతం పనిచేయలేని పరిస్థితి నెలకొంది.

అమల్లోకి 144 సెక్షన్

- బాణసంచా కేంద్రాల మూసివేత
- 3, 4, 5 తేదీల్లో మద్యం దుకాణాలు బంద్
- జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ సమస్య ఉండబోదు
- కౌంటింగ్ మధ్యాహ్నం 3 గంటలకే పూర్తిచేస్తాం
- జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి



తుమ్మపాల: సార్వత్రిక ఎన్నికల్లో చివరి దశ పోలింగ్ ముగిసి ఎగ్జిట్ పోల్ ఫలితాలు శనివారం వెలువడనున్న నేపథ్యంలో.. శుక్రవారం సాయంత్రం నుంచే జిల్లాలో 144 సెక్షన్ అమల్లోకి వచ్చిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి చెప్పారు. ఆయన చాంబర్లో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎటువంటి అల్లర్లు తలెత్తకుండా జనం గుంపులుగా తిరగకుండా పోలీసులు నిరోధిస్తారన్నారు. ఇప్పటికే మందుగుండు, బాణసంచా కేంద్రాలను మూసివేయించామని, 3, 4, 5 తేదీల్లో మద్యం దుకాణాలు కూడా బంద్ చేస్తామన్నారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రానికి రెండు కిలోమీటర్ల పరిధిలో రెడ్‌జోన్ అమలవుతుందని, ఈ ప్రాంతంలో డ్రోన్‌లు ఎగరవేయకూడదన్నారు. 144 సెక్షన్ జూన్ 5వ తేదీ వరకు అమల్లో ఉంటుందన్నారు.

ఇక్కడ పోస్టల్ బ్యాలెట్ సమస్య లేదు

పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై జిల్లాలో ప్రభుత్వ సిబ్బందికి ముందుగానే శిక్షణ ఇచ్చినందున ఇక్కడ దాదాపుగా సమస్య తలెత్తకపోవచ్చని కలెక్టర్ చెప్పారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది చేసుకున్న ఫారం-12 డీ దరఖాస్తులను బట్టి పోలింగ్ కేంద్రాల్లో గెజిటెడ్ అధికారుల ధ్రువీకరణకు ఏర్పాట్లు చేశామని, పోస్టల్ ఓటింగ్ ప్రక్రియ పక్కాగా జరిగిందన్నారు. ఇతర జిల్లాలో సిబ్బంది వినియోగించుకున్న పోస్టల్ బ్యాలెట్ల విషయంలో మాత్రమే అటస్టేషన్ సమస్యలు తలెత్తవచ్చన్నారు.

మధ్యాహ్నం 3 గంటలకు లెక్కింపు పూర్తి చేస్తాం

ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం కౌంటింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పక్కాగా చేపడుతున్నామన్నారు. కౌంటింగ్ ప్రక్రియ మొత్తం ఆరు గంటల వ్యవధిలో పూర్తి చేసేందుకు సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. జూన్ 4న మధ్యాహ్నం 3 గంటలకు దాదాపు కౌంటింగ్ పూర్తికావచ్చన్నారు. ఎన్నికల సిబ్బందితో పాటు అభ్యర్థులు, ఏజెంట్లు, ఇతరులెవ్వరికీ ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్, స్మార్ట్ వాచ్, కనీసం పెన్ కూడా తీసుకెళ్లేందుకు అనుమతి లేదన్నారు. గెలిచిన అభ్యర్థులు అనుమతి తీసుకున్న తర్వాతే ర్యాలీలు చేపట్టాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ మొత్తం సీసీ కెమెరాల సర్వైలెన్స్‌లో ఉంటుందన్నారు. వాకీటాకీ ద్వారా సమాచార సేకరణ జరుగుతుందన్నారు.

బడి తెరిచిన రోజునే విద్యాకానుక పంపిణీ

- స్కూళ్లకు పుస్తకాలు సకాలంలో సరఫరా
- ఆర్జేడీ విజయభాస్కర్

విశాఖ విద్య: బడి తెరిచిన రోజునే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులందరికీ విద్యాకానుక అందించేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ అన్నారు. విశాఖ డీఈవో ఎల్.చంద్రకళతో కలిసి శుక్రవారం గాజువాకలోని ఉమ్మడి విశాఖ జిల్లా పుస్తకాల నిల్వ గోదామును పరిశీలించారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఇప్పటి వరకు ఎన్ని పుస్తకాలు వచ్చాయి, ఎంత మేర మండలాల్లోని స్టాక్ పాయింట్లకు సరఫరా చేశారనే విషయాలను గోదాము మేనేజర్ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు 14,66,883 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా మే 31 వరకు 9,16,691 వచ్చినవని అధికారులు వివరించారు. వీటిలో 7,03,154 (76 శాతం) మండల స్టాక్ పాయింట్లకు సరఫరా చేశామన్నారు. అల్లూరి జిల్లాకు 45 శాతం, అనకాపల్లి జిల్లాకు 48 శాతం, విశాఖపట్నం జిల్లాకు 47 శాతం పాఠ్యపుస్తకాలను సరఫరా చేశామని తెలిపారు. ఏ ఒక్క విద్యార్థికి పాఠ్యపుస్తకాలు అందలేదనే మాట రాకూడదన్నారు.



పుస్తకాల గోడౌన్‌ను పరిశీలిస్తున్న ఆర్జేడీ

అనుమానాస్పద స్థితిలో ఇద్దరు మృతి



మృతదేహాలు ఉన్న లారీ



అంబులెన్స్‌లో తరలిస్తున్న మృతదేహాలు



లారీ డ్రైవర్ అప్పారావు

- మృతులు అనకాపల్లి వాసులు

నవాబుపేట క్రాస్‌రోడ్స్ (పెనుగంచిప్రోలు): అనుమానాస్పద స్థితిలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండల పరిధిలోని నవాబుపేట క్రాస్‌రోడ్స్ వద్ద శుక్రవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం తక్కెళ్లపాడుకు చెందిన లారీ విశాఖపట్నంలో బొగ్గు లోడ్ చేసుకుని జగ్గయ్యపేట సమీపంలోని సిమెంట్ ఫ్యాక్టరీకి వెళ్తోంది. ఈ క్రమంలో అనకాపల్లికి చెందిన లారీ డ్రైవర్ కనగాల అప్పారావు లారీలో తనతో పాటు సరదాగా వచ్చిన అనకాపల్లికి చెందిన స్నేహితులు గంధం సత్యనారాయణ(57), బోదాపు వెంకట సత్య నరసింగరావు(47) లారీలో ప్రయాణిస్తూ చనిపోయినట్టు 108 సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించాడు. చిల్లకల్లు ఎస్‌ఐ సతీష్, ఏఎస్‌ఐ శంకర్ వచ్చేసరికి సత్యనారాయణ, నరసింగరావు మృతి చెంది ఉండటంతో పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డ్రైవర్ అప్పారావుతోపాటు మృతులు కూడా మద్యం తాగి ఉన్నట్టు పోలీసులు పేర్కొన్నారు. ఎండ, ఉక్కపోతకు తట్టుకోలేక వారు చనిపోయి ఉంటారని భావిస్తున్నారు. ఎలా చనిపోయారని డ్రైవర్‌ను అడిగితే ఏమీ చెప్పలేక పోతున్నాడు. మధ్యాహ్న సమయంలో ఎక్కడో చనిపోయి ఉంటారని లారీని ఇక్కడకు తెచ్చి ఆపేశాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుల కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. నరసింగరావు ఎస్‌బీఐలో పనిచేసి సస్పెండ్ అయి ఉన్నాడని, సత్యనారాయణ స్టీల్‌ప్లాంట్‌లో పనిచేసి ఉద్యోగవిరమణ పొందినట్లు వివరాలు తెలిశాయని పోలీసులు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు



కోనాంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటను పరిశీలిస్తున్న ఛత్తీస్‌గఢ్ బృందం

చీడికాడ: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి సి.హెచ్.లచ్చన్న అన్నారు. జి.కొత్తపల్లి, కోనాం గ్రామాల్లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతివాడ జిల్లా వ్యవసాయ అధికారుల బృందం, క్రాంతిధృవ్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు శుక్రవారం పర్యటించారు. గిరిజన రైతులు పాటిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పరిశీలించారు. కొత్తపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద రైతులతో మాట్లాడారు.

ప్రాంతీయ ప్రకృతి వ్యవసాయ అధికారుల బృందం సభ్యులు కృష్ణారావు, ప్రకాశరావు, హిమశేఖర్, దేముళ్లు, జిల్లా సమన్వయకర్త గోవింద తదితరులు పాల్గొన్నారు.

నిద్రిస్తున్న క్లీనర్లపైనుంచి వెళ్లిన లారీ

- ఎన్టీపీసీ బూడిద చెరువు వద్ద ప్రమాదం
- ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు





వినయ్‌కుమార్ మృతదేహం (ఇన్‌సెట్) మృతి చెందిన వినయ్ కుమార్(ఫైల్)

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఫ్లైయాష్ పాయింట్ వద్ద గురువారం రాత్రి నిద్రిస్తున్న క్లీనర్లపై నుంచి లారీ వెళ్లిన ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పరవాడ సీఐ బాల సూర్యారావు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీపీసీ బూడిద చెరువు ఎల్-4 వద్ద గురువారం రాత్రి 11.30 గంటలకు ఫ్లైయాష్ లోడింగ్ కోసం లారీలను వరస క్రమంలో ఉంచారు. వేర్వేరు ఫ్లైయాష్ లోడింగ్ లారీల క్లీనర్లుగా అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం గిడుతూరుకు చెందిన వారా వినయ్‌కుమార్(19), అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం వేములపూడికి చెందిన ఎం.దిలీప్‌కుమార్(24) పని చేస్తున్నారు. వీరిద్దరూ సీరియల్ మొదట ఉన్న లారీ ముందు ఎడమ చక్రం వైపు నిద్రించారు. ఇంతలో లోడింగ్ సీరియల్ రావడంతో లారీ డ్రైవర్ వీరు నిద్రించిన విషయం గుర్తించకుండా.. వారిపై నుంచి నడిపాడు. ఈ ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గుర్తించిన తోటి డ్రైవర్లు వీరిద్దరినీ అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వినయ్‌కుమార్ చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. మెరుగైన చికిత్స కోసం దిలీప్‌ను కేజీహెచ్‌కు తరలించి వైద్యం అందిస్తున్నారు. వినయ్‌కు వివాహం కాలేదు. దిలీప్‌కు మూడేళ్ల కిందట వివాహం కాగా.. రెండేళ్ల కుమార్తె ఉంది. వినయ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

మృతుడి బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాలసూర్యారావు చెప్పారు. ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి వినయ్‌కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గాయపడిన దిలీప్‌కు మెరుగైన వైద్యం అందించాలన్నారు.

అంధుల జీవితాల్లో ఆశాకిరణం

- అంధ బాలికలకు విశాఖలో ప్రత్యేక పాఠశాల
- ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఏకైక విద్యాలయం
- చదువులతో పాటు ఆటల్లోనూ రాణించేలా తర్ఫీదు
- అంధుల ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో ఆడిన పాఠశాల విద్యార్థిని
- రాష్ట్రంలో ఏ జిల్లా వారైనా ఇక్కడ చేరే అవకాశం
- 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



విద్యార్థినులకు చెస్ నేర్పుతున్న పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్



వసతి గృహంలో విద్యార్థినులకు పసందైన విందు భోజనం

విశాఖ విద్య: అంధ బాలికల చదువులకు బీచ్‌రోడ్‌లోని పాఠశాల భరోసాగా నిలుస్తోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో అంధ విద్యార్థుల కోసం రాష్ట్రంలోని విశాఖపట్నం, విజయనగరం, హిందూపూర్‌లో పాఠశాలలు నిర్వహిస్తుండగా.. విశాఖలో బాలికలకు మాత్రమే ప్రవేశాలు కల్పిస్తున్నారు. రాష్ట్రంలోని ఏ జిల్లాకు చెందిన వారైనా ఇక్కడి పాఠశాలల్లో చదువుకోవచ్చు. 6 నుంచి 14 ఏళ్ల వయసు గల 40 శాతంకు పైగా అంధత్వం కలిగిన బాలికలు ఇక్కడ చేరేందుకు అర్హులు. 1 నుంచి 10వ తరగతి వరకు నిర్వహిస్తున్న ఈ పాఠశాలలో 100 మంది సామర్థ్యం కాగా.. ఇప్పటికే 52 మంది బాలికలు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. 2024-25 విద్యా సంవత్సరం ప్రవేశాల్లో భాగంగా మిగిలిన 48 మంది సీట్ల భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

సువిశాల విస్తీర్ణంలో..

సముద్ర తీరానికి అనుకుని(బీచ్ రోడ్) మూడు ఎకరాల విస్తీర్ణంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో పాఠశాల కొనసాగుతోంది. అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ద్వారా ఇచ్చే యూనిఫాంలతో పాటు విద్యాకానుక వీరికి అందిస్తున్నారు. అంధ విద్యార్థినులు చదువులతో పాటు ఆటల్లోనూ రాణిస్తున్నారు. పూర్వ విద్యార్థిని ఎం.సత్యవతి ఇటీవల జరిగిన అంధుల ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో మన రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించింది. పాఠశాలలో క్రీడలకు కూడా ప్రాధాన్యమిస్తుండటంతో.. విద్యార్థినులు చెస్, వెయిట్ లిఫ్టింగ్ వంటి పోటీల్లోనూ సత్తా చాటుతున్నారు.

పది ఫలితాల్లో రికార్డు

పాఠశాల విద్యార్థినులు కొన్నేళ్లుగా 10వ తరగతిలో శతశాతం ఫలితాలు సాధిస్తూ రికార్డు సృష్టిస్తున్నారు. ఎస్‌సీఈఆర్టీ సిలబస్‌తో ప్రభుత్వం సరఫరా చేసిన బెయిలీ లిపితో ముద్రించిన పుస్తకాలను వినియోగిస్తూనే.. అధునాతన పరికరాలతో ఇక్కడి ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. నాన్ వెర్బల్ డెస్క్‌టాప్ అసిస్టెంట్(ఎన్‌వీడీఏ) విధానం ద్వారా కంప్యూటర్ స్క్రీన్ నుంచి వచ్చే శబ్దాలను అనుసరించి సరికొత్త పాఠ్యాంశాలను నేర్చుకుంటున్నారు. డైజీ ప్లేయర్లో రికార్డు చేసిన పాఠ్యాంశాలను వింటూ చదువుల్లో ముందుకెళ్తున్నారు. బ్రెయిలీ లిపితో నిక్షిప్తమైన 'అని సిస్టమ్స్'(దివీస్ సంస్థ స్పాన్సర్) విద్యార్థినులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.



విశాఖ సాగర నగర్‌లోని అంధబాలికల పాఠశాల



విశాలమైన గదిలో పడక కోసం ఏర్పాట్లు

భద్రతతో కూడిన విద్య

ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మా పాఠశాలలో విద్యార్థినులకు భద్రతతో కూడిన చదువులు అందిస్తున్నాం. మేము కూడా వారిలాంటి వారిమే కాబట్టి, మా బిడ్డల్లా చూసుకుంటూ వారి భవిష్యత్‌కు పాటుపడుతున్నాం. పాఠశాలలో గతంలో కన్నా బాగా సౌకర్యాలు మెరుగుపడ్డాయి. రాష్ట్రంలోని ఎక్కడ వారైనా స్కూల్లో చేర్చుకుంటాం.

– జి.తిరుమల ప్రసాద్, ప్రిన్సిపాల్, అంధ బాలికల ఆశ్రమ పాఠశాల

క్లుప్తంగా

కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ శివానంద్



డాబాగార్డెన్స్(విశాఖ): కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ శివానంద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది డాక్టర్ శివానంద్‌కు అభినందనలు తెలిపారు. ఇటీవల కేజీహెచ్‌లో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ లాంగ్ లీవ్‌లో ఉన్న దృష్ట్యా ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ వాణికి బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు డాక్టర్ శివానంద్ కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు.

ఆర్ఏఆర్ఎస్‌లో డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

అనకాపల్లి: స్థానిక ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో డిప్లొమా కోర్సులలో ప్రవేశానికి ఎస్ఎస్‌సీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల నుంచి ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ పి.వి.కె.జగన్నాథరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్ఏఆర్ఎస్‌లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఎటువంటి ప్రవేశ పరీక్షలు ఉండవని, ఎస్ఎస్‌సీ మార్కులను ప్రామాణికంగా తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం angrau. ac. in వెబ్‌సైట్‌ను ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల మధ్యలో సంప్రదించాలని ఆయన కోరారు.

చెస్ క్రీడాకారుడికి అభినందన



కందలం తేజను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ స్వాతి

అనకాపల్లి: స్థానిక చింతావారి వీధికి చెందిన కందలం తేజ అంతర్జాతీయ చెస్‌పోటీల్లో ద్వితీయస్థానంలో నిలిచింది. రూ. 10వేలు నగదుబహుమతి సాధించింది. ఈ నేపథ్యంలో ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్వాతి శుక్రవారం కళాశాల ఆవరణలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ మే 24 నుంచి 26వ తేదీ వరకూ మహారాష్ట్ర పూణేలో అంతర్జాతీయ చెస్‌పోటీలు జరిగాయని, ఈ పోటీల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థి ప్రతిభ కనబరచడం అభినందనీయమని పేర్కొన్నారు.

నడి వేసవిలో నారాయణ

- బరితెగించిన నారాయణ యాజమాన్యం
- వేసవిలోనూ తరగతుల నిర్వహణ
- గత నెల 20 నుంచి రెండు పూటలా బడి
- వడగాల్పులతో అల్లాడుతున్న విద్యార్థులు
- అనుమతుల్లేకున్నా సీబీఎస్ఈ సిలబస్ బోధన
- ఆనందపురం మండల అనుమతులతో నగరంలో నిర్వహణ
- విచారణ చేపట్టిన విద్యాశాఖాధికారులు



ఆటో నుంచి పాఠశాల వద్ద దిగుతున్న విద్యార్థులు



పాఠశాలకు ఆటోలో వస్తున్న విద్యార్థులు

విశాఖ విద్య: నారాయణ విద్యా సంస్థల యాజమాన్యం బరి తెగించింది. విద్యా వ్యాపారమే ధ్యేయంగా నిబంధనలకు నీళ్లొదిలింది. వేసవిలో పాఠశాలలు తెరవవద్దని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ.. అంతా మా ఇష్టమంటూ విశాఖ నగరంలోని సీబీఎం కాంపౌండ్ ఏరియాలోని నారాయణ స్కూల్‌లో దర్జాగానే తరగతులు నిర్వహిస్తోంది. కొంతమంది తల్లిదండ్రుల సమాచారం మేరకు ‘సాక్షి’ శుక్రవారం పరిశీలన చేయగా ఆటోలు, ఇతర వాహనాల ద్వారా విద్యార్థులు వస్తూ, పాఠశాలలోకి వెళ్లడం కనిపించింది. విద్యార్థులు పుస్తకాల బ్యాగుతో పాటు మధ్యాహ్న భోజనం క్యారేజీలను సైతం తెచ్చుకోవడాన్ని బట్టి ఇక్కడి పాఠశాల రెండు పూటల నిర్వహిస్తున్నట్లు స్పష్టమవుతోంది. గత నెల 20 నుంచి పాఠశాల నిర్వహిస్తున్నారని పలువురు విద్యార్థులు తెలిపారు. ఎండ తీవ్రతతో వడగాల్పులు వీస్తున్న తరుణంలో విద్యార్థులను స్కూల్‌కు రప్పించి, తరగతులు నిర్వహిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గుర్తింపుపై అనుమానాలు

సీబీఎం కాంపౌండ్‌లో నిర్వహిస్తున్న నారాయణ స్కూల్‌కు ప్రభుత్వ పరంగా ఉన్న గుర్తింపుపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆనందపురం మండలం పెద్దిపాలెంలో నిర్వహించేందుకని అనుమతులు తీసుకుని.. నగరంలోని హై ప్రొఫైల్ ఏరియాగా గుర్తింపు ఉన్న సీబీఎం కాంపౌండ్‌లో స్కూల్ నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లన్నీ యు–డైస్ కోడ్‌తో నమోదై ఉండాలి. విశాఖ నగరంలోని ప్రకాశరావు పేట స్కూల్ కాంప్లెక్ పరిధిలోకి వచ్చే సీబీఎం ఏరియా పాఠశాలల జాబితాను పరిశీలిస్తే.. ఇప్పటి వరకు సాగిన లొసుగుల వ్యవహారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

రంగంలోకి దిగిన విద్యాశాఖాధికారులు

సీబీఎం కాంపౌండ్ ఏరియాలో నారాయణ స్కూల్ నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు రంగంలోకి దిగారు. ఆర్జేడీ విజయ భాస్కర్ ఆదేశాలతో డీఈవో ఎల్.చంద్రకళ సూచనల మేరకు డిప్యూటీ డీఈవో సువర్ణ, మహరాణిపేట ఎంఈవో పైడపునాయుడు శుక్రవారం సాయంత్రం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. విద్యార్థులు స్కూల్‌కు ఎందుకు వచ్చారనే దానిపై పూర్తి స్థాయిలో నిర్వాహకుల నుంచి వివరాలు సేకరించారు.

కార్పొరేట్ దోపిడీకి అడ్డుకట్ట వేయాల్సిందే..

ప్రైవేటు పాఠశాలకు టెక్నో, ఒలింపియాడ్, ఐకాన్ వంటి పేర్లతో ప్రచారం చేయకూడదనే నిబంధన ఉంది. కానీ సీబీఎం కాంపౌండ్‌లో నిర్వహిస్తున్న పాఠశాలకు మెడికాన్ పేరుతో విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. బైపీసీ క్యాంపస్‌గా పాఠశాల యాజమాన్యం ప్రచారం చేస్తూ తల్లిదండ్రుల ఆశలతో విద్యా వ్యాపారం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఐకాన్ మెడికాన్, సీవో అంటూ పాఠశాల స్థాయిలోనే విభజిస్తూ విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించడానికి వీల్లేదు. అలాంటి వాటిపై కఠినంగానే వ్యవహరిస్తాం. సీబీఎస్ఈ గుర్తింపు లేకుండా ఆ పేరుతో పాఠశాల యాజమాన్యాల వారు విద్యార్థులను చేర్చుకోవద్దు. ప్రైవేట్ పాఠశాలన్నింటికీ తప్పనిసరిగా గుర్తింపు ఉండాలి. దీనిపై మండల స్థాయిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించేలా ఆదేశాలిచ్చాం.

– బి.విజయ భాస్కర్, ఆర్జేడీ, విశాఖపట్నం

చురుగ్గా దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు సర్వే



దివ్యాంగ విద్యార్థుల సర్వేను పరిశీలిస్తున్న శకుంతల

తుమ్మపాల: ప్రాథమిక స్థాయిలోనే దివ్యాంగ విద్యార్థులను గుర్తించడం వలన వారికి అవసరమైన సేవలను, సదుపాయాలు కల్పించడం సులభమవుతుందని జిల్లా సమగ్ర శిక్ష సాహిత విద్య జిల్లా కో ఆర్డినేటర్ శకుంతల తెలిపారు. గవరపాలెంలో ఏపీ సమగ్ర శిక్ష పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు సర్వేను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు సర్వే చురుగ్గా సాగుతోందన్నారు. జిల్లాలో కొత్తగా 327 మందిని గుర్తించామని, వారిలో మండలానికి చెందిన 35 మంది ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాదేవి, యేసురత్నం, దివ్యాంగ పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విశాఖ కేంద్ర కారాగారాన్ని సందర్శించిన ఐజీ



మాట్లాడుతున్న ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారాన్ని జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. జైల్ సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్‌తో కలసి జైలు లోపల ఖైదీలు ఉండే బేరక్‌లు, లోపల పరిసరాలు, పారిశుద్ధ్యం పరిస్థితి, వంటశాల తదితర వాటిని పరిశీలించారు. బేరక్‌లలో ఉన్న ఖైదీలతో ఆయన నేరుగా మాట్లాడి వైద్య సదుపాయాలు, భోజనం, వసతి గురించి ఆరా తీశారు. నిబంధనల ప్రకారం ఖైదీలకు సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఖైదీలు క్రమశిక్షణతో ఉండాలని చెప్పారు. అనంతరం జైలు సమావేశం మందిరంలో నిర్వహించిన కోస్తా ఆంధ్రా అధికారుల సమావేశంలో పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన జిల్లా సబ్ జైల్ అధికారి బత్తిలి కృష్ణారావును అభినందించారు. ఆయనకు శాలువ కప్పి సత్కరించారు. కృష్ణారావు సేవలను కొనియాడారు. జైలులో ఉద్యోగం చేసే వారు సేవా భావంతో మెలగాలని కోరారు.

లారీ బోల్తా: డ్రైవర్‌కు గాయాలు

కశింకోట: తాళ్లపాలెం వద్ద చేపల లోడు లారీ అదుపు తప్పి శుక్రవారం బోల్తా పడింది. డ్రైవర్ గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. కాకినాడ నుంచి కోల్‌కతా బయలుదేరిన చేపలు లోడు లారీ తాళ్లపాలెం మామిడివాక వంతెన వద్దకు చేరేసరికి అదుపు తప్పి పక్కనున్న పల్లపు ప్రాంతంలోకి బోల్తా పడింది. దీంతో లారీ డ్రైవర్ కేబిన్‌లో చిక్కుకొని గాయపడగా హైవే మొబైల్ సిబ్బంది, పోలీసులు బయటకు తీసి అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నేడు,రేపు ఆర్గానిక్ మామిడి పండ్ల సంత

మద్దిలపాలెం: సహజ సిద్ధంగా పండించి ముగ్గించిన వివిధ రకాల జాతుల మామిడి పండ్లను విశాఖ ప్రజలకు అందించాలని ఆలోచనతో మామిడి పండ్ల సంతను జూన్ 1,2 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వివరాలు శివాజీపాలెంలోని కార్యాలయంలో శుక్రవారం ఆయన వివరించారు. ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘం ప్రతి నెల చేసే సేవా కార్యక్రమంలో భాగంగ రైతులను ఆదుకోవడానికి ఈ నెల మామిడి పండ్ల సంతను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంత ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో తులసి నేచురల్స్ సత్యనారాయణ, అశోక్, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన దుర్గ

రాంబిల్లి: సెజ్ కాలనీకి సమీపంలో లోటస్ స్కూల్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వివాహితకు తీవ్ర గాయాలయ్యాయి. వై.లోవ గ్రామానికి చెందిన బి.దుర్గ రోడ్డు దాటుతుండగా రాంబిల్లి నుంచి వెంకటాపురం వైపు వెళ్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దుర్గను విశాఖపట్నం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. రాంబిల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బండరాళ్ల లారీ బోల్తా



రాంబిల్లి సబ్‌స్టేషన్ సమీపంలో బోల్తా పడిన బండరాళ్ల లారీ

రాంబిల్లి : బండరాళ్లను తరలిస్తున్న లారీ రాంబిల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం బోల్తా పడింది. నేవల్‌బేస్‌కు బండరాళ్లను తరలిస్తున్న లారీ టైరు పంక్చరై అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. రెండు రోజుల క్రితమే ఒక బండరాళ్ల లారీ అదుపు తప్పి రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టడం ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. శుక్రవారం మరో లారీ బోల్తా పడింది. బండరాళ్ల లారీలపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మహిళ మెడలో బంగారు తాడు అపహరణ

నర్సీపట్నం: నిద్రిస్తున్న సమయంలో మెడలో బంగారు తాడు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని బలిఘట్టంకు చెందిన సుర్ల రాజేశ్వరి పట్టణ సీఐ కాంతికుమార్‌కు ఫిర్యాదు చేసింది. బాధితరాలు కథనం ప్రకారం గురువారం రాత్రి భర్త, పిల్లలు మేడ మీద పడుకున్నారు. రాజేశ్వరి కింద పడుకుంది. ఒంటరిగా పడుకోవటం పసిగట్టిన దుండగులు రాత్రి 12 గంటల సమయంలో నిద్రలో ఉన్న ఆమె మెడలో రెండున్నర తులాల బంగారం తాడును అపహరించుకుపోయారు. నిద్రలో నుంచి మహిళ తేరుకోని ఏడుస్తూ మేడపై నిద్రిస్తున్న భర్త వద్దకు వెళ్లి విషయం చెప్పింది. భర్త, చుట్టు పక్కల వారు పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ దుండగులు అప్పటికే పరారయ్యారు. 100కు కాల్ చేసినప్పటికీ స్పందించలేదు. 2 గంటల సమయంలో బాధితులు స్వయంగా స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆర్టీసీ, రైల్వే స్టేషన్లలో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి



కంప్యూటర్ శిక్షణలో సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో ఆర్‌జేడీ విజయభాస్కర్

- విద్యాశాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్

అనకాపల్లి: ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే గ్రంథాలయాలను నిత్యదర్శనీయ కేంద్రాలుగా విద్యార్థులు, యువత గుర్తించాలని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) బి.విజయభాస్కర్ అన్నారు. స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో ‘కెరీర్ గైడెన్స్.. భవిష్యత్’ అంశంపై శుక్రవారం జరిగిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శుక్రవారం మాట్లాడారు. జీవితమంతా గ్రంథాలయాలను సందర్శించాలని, ఆర్టీసీ, రైల్వే స్టేషన్లలో గ్రంథాలయాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భారత దేశానికి స్వాతంత్య్రం లభించడానికి ప్రాచీన గ్రంథాలయాలే ముఖ్యభూమికను పోషించాయని ఆయన పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను టూరిస్టు, రెస్టారెంట్లకే కాకుండా గ్రంథాలయాలకు కూడా తీసుకువెళ్లాలని ఆయన కోరారు. వ్యవసాయ భూమి సాగు మాదిరి ప్రతి ఒక్కరూ మెదడును కూడా కొత్త ఆలోచనలతో సాగు చేసుకోవాలన్నారు. మరొకరితో పోల్చుకోకుండా ఎవరికి వారు లక్ష్య సాధనకు కృషి చేయాలని ఆయన కోరారు. స్కూలు స్థాయిలో విద్యార్థులు తమ భవిష్యత్తు గురించి ఆలోచించాలని, కెరీర్ పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పదో తరగతి నుంచి పీ.జీ. వరకు విద్యావకాశాలను, రాయాల్సిన ఎంట్రన్స్ పరీక్షలను, తమ అభిరుచికి అనుగుణమైన కోర్సుల ఎంపిక విధానం గురించి ఆయన సమగ్రంగా వివరించారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యం, సంరక్షణకు తల్లిదండ్రులు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మార్కుల వేటలో పగలూ రాత్రీ తేడా లేకుండా సాధన చేయించే విధానాలకు స్వస్తి పలికి ఆటలు, నిద్ర, ఇతర అంశాలకూ చోటుండేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. అనంతరం నెల రోజులుపాటు జరిగిన కంప్యూటర్ శిక్షణా తరగతులు ముగింపు కార్యక్రమంలో భాగంగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, అధ్యాపకులు విల్లూరి అప్పల సత్యనారాయణ, కంప్యూటర్ శిక్షకులు శరగడం కిశోర్ బాబు, కె.గౌరీశ్వరి, జి.నాగమణి, పి.ఇందిర, విద్యార్థులు, నిరుద్యోగులు, యువత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో పరిణామాలపై కలెక్టర్ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

విశాఖ సిటీ: కేజీహెచ్‌లోని వివిధ విభాగాల అధిపతులతో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సమావేశమయ్యారు. పరిపాలనా విభాగంలో ఇటీవల జరిగిన పరిణామాలు, చోటుచేసుకున్న ఘటనల నేపథ్యంలో శుక్రవారం కాన్ఫరెన్స్ హాలులో వివిధ అంశాలపై సమీక్షించారు. నియమ, నిబంధనలకు లోబడి అందరూ పనిచేయాలని, విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. మంచి పనితీరు కనబరిచి రోగులకు ఉత్తమ సేవలందించాలని చెప్పారు. సమావేశంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె. శివానంద్, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

హోటల్స్, పండ్ల దుకాణాలపై దాడులు



శాంపిల్స్ వివరాలను నమోదు చేస్తున్న ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ రవికుమార్



ఆహారపదార్థాల నుంచి శాంపిల్స్ సేకరిస్తున్న సిబ్బంది

నర్సీపట్నం : హోటల్స్, పండ్ల దుకాణాలపై దాడులు నిర్వహించి 20 శాంపిల్స్ సేకరించామని డివిజనల్ ఆహార భద్రతా తనిఖీ అధికారి బి.రవికుమార్ తెలిపారు. పాచిపోయిన ఆహారపదార్థాలు అమ్ముతున్నట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు పాలిమర్ హోటల్‌లో తనిఖీలు నిర్వహించారు. హోటల్‌లో తయారు చేసిన ఆహారపదార్థాల నుంచి 5 శాంపిల్స్ సేకరించామన్నారు. శాంపిల్స్‌లో కల్తీ జరిగినట్టు నిర్ధారణ అయితే హోటల్ యజమానిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ హోటల్‌తో పాటు పట్టణంలో పలు పండ్ల దుకాణాల నుంచి 15 శాంపిల్స్ సేకరించామన్నారు. నాణ్యత లేకుండా ఆహారపదార్థాలను విక్రయించినట్లయితే హోటల్స్, దుకాణాలను సీజ్ చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

పొగాకు కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేస్తోంది



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న అదనపు డీఎంహెచ్‌వో పూరేంద్రబాబు

విశాఖ సిటీ: పొగాకు జీవితాన్నే కాకుండా కుటుంబాన్నే ఛిన్నాభిన్నం చేస్తుందని అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నుంచి సత్యం జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఆయన జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సిగరెట్, తంబాకు వినియోగించడం ఫ్యాషన్ కాదని, అది మరణానికి దారిగా హెచ్చరించారు. అందుకే భారత ప్రభుత్వం బహిరంగ ప్రదేశాల్లో పొగాకు వినియోగాన్ని నిషేధించిందని గుర్తు చేశారు. పొగాకు, ధూమపానం వల్ల వచ్చే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించేందుకు ఏటా మే 31న పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ధూమపానం కారణంగా హృదయనాళ, జీర్ణ వ్యవస్థ, చర్మ ఆరోగ్యం, పునరుత్పత్తి వ్యవస్థ దెబ్బతినడంతో పాటు అంధత్వానికి దారి తీయవచ్చని హెచ్చరించారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సమత మాట్లాడుతూ పొగాకు నియంత్రణ కోసం అన్ని శాఖలు కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించాలని, గ్రామ పంచాయతీ సభ్యులు, ఎన్‌జీవో సంస్థలు, రైతులు, యువత, విద్యార్థులు అందరూ పాల్గొని పొగాకు రహిత భారత దేశ నిర్మాణం కోసం కృషి చేయాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు డాక్టర్ ఎస్.జీవన రాణి, బి.నాగేశ్వరరావు, డాక్టర్ నళిని, డాక్టర్ జగదీష్ ప్రసాద్, డాక్టర్ బాలాజీ, ధర్మేంద్ర, మోహన్, నాగభూషణం ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

కొమ్మాది: రాష్ట్ర స్థాయి 9వ రగ్బీ జూనియర్ బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం తిమ్మాపురంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రగ్బీ గేమ్‌లో వేగవంతం, క్రీడాకారుల దమ్ము కనిపిస్తోందన్నారు. క్రీడాకారులు పోటీల్లో రాణించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకుని రావాలని ఆకాంక్షించారు. అనంతరం 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు. బాలికల క్వార్టర్ ఫైనల్స్‌కు అనంతపూర్, కర్నూలు, ప్రకాశం, ఈస్ట్ గోదావరి, గుంటూరు జట్లు చేరాయి. బాలుర విభాగం నెల్లూరు, కర్నూలు, శ్రీకాకుళం, గుంటూరు, ప్రకాశం, తూర్పు గోదావరి జట్లు చేరాయి. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి. రామాంజనేయులు, జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శి లలిత్ కుమార్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశాలు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సెల్ఫ్ సపోర్ట్ విధానంలో నిర్వహిస్తున్న బీఎస్సీ(హానర్స్), ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్ టెక్నాలజీ ప్రోగ్రాంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సులో 40 మందికి ప్రవేశం కల్పిస్తామని, కోర్సు ఫీజుగా రూ.65 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. జూన్ 2వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవాలని, 12వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించి, 14వ తేదీన కౌన్సెలింగ్ జరిపి ప్రవేశాలు కల్పిస్తామన్నారు. నూతన విద్యా విధానం 2020లో పేర్కొన్న విధంగా ఈ కోర్సుకు మల్టీ ఎంట్రీ, ఎగ్జిట్ ఆప్షన్‌ను కల్పిస్తున్నారు. ఒక ఏడాది కోర్సు పూర్తి చేస్తే సర్టిఫికెట్, రెండు సంవత్సరాలు కోర్సు పూర్తిచేస్తే డిప్లమా, మూడు సంవత్సరాల కోర్సు పూర్తిచేస్తే బ్యాచలర్ డిగ్రీ, నాలుగు సంవత్సరాల కోర్సు పూర్తి చేస్తే హానర్స్ డిగ్రీ, ఐదు సంవత్సరాలు పూర్తిచేస్తే ఎమ్మెస్సీ డిగ్రీని అందిస్తారు. ఇంటర్ ఎంపీపీ, బైపీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను పెదవాల్తేరులోని ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా అందజేయాలని సూచించారు.

క్లుప్తంగా

నేడు హనుమాన్ జయంతి



అనకాపల్లి: పట్టణ, మండల ప్రాంతాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఆయా ఆలయాల ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. ఆలయాలను రంగులు, పూల మాలలతో ముస్తాబు చేశారు. తెల్లవారు జాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు, హనుమాన్ చాలీసా పఠనం తదితర పూజా ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరపనున్నట్లు పలు కమిటీల సభ్యులు తెలిపారు.

హడలెత్తిస్తున్న సూరీడు



కశింకోటలో ఎండ ధాటికి జన సంచారం లేక వెలవెలబోయిన ప్రధాన రహదారి

కశింకోట: మండల ప్రజానీకం సూర్య తాపంతో శుక్రవారం విలవిల్లాడారు. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రంగా ఉండటంతో ఇళ్ల నుంచి బయటకు రావడానికి సాహసించలేకపోయారు. సాయంత్రం 5 గంటల వరకు ఇదే పరిస్థితి. దీంతో చాలా వరకు జనాలు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో కశింకోటలోని ప్రధాన రహదారి, వీధులు, తాళ్లపాలెం కూడలి జన సంచారం లేక బోసిపోయాయి. సాయంత్రం ఎండ తీవ్రత తగ్గాక ప్రజలు తమ కార్యకలాపాల్లో నిమగ్నమయ్యారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

కశింకోట: మండలంలోని వేర్వేరు గ్రామాల్లో విక్రయానికి మద్యం తరలిస్తుండగా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారి నుంచి 20 బ్రాందీ సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అచ్చెర్లలో సీహెచ్ రాజు, జమాదులపాలెంలో ఎం.ఈశ్వరరావు చెరో పది బ్రాందీ సీసాలు తరలిస్తుండగా పట్టుకుని, అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

ఉత్సాహంగా పోటీలు

రావికమతం: కొత్తకోట శాఖా గ్రంథాలయంలో బాల బాలికలకు ఆటలు పోటీలతోపాటు కథలు, బుక్ రీడింగ్ ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. వేసవి శిబిరంలో భాగంగా శుక్రవారం ఆట పాటలతో పుస్తకాలు చదివించారు. కథలు చెప్పిస్తూ వారికి ఏయే కళల పట్ల మక్కువ ఉందో తెలుసుకుని తర్ఫీదు ఇస్తున్నారు. ఈ నెల 7న ముగింపు కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేస్తామని గ్రంథపాలకురాలు వరహామణి తెలిపారు.

అనకాపల్లి సినిమాలు

గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి	: రాజా
గం గం గణేశా	: సత్యనారాయణ స్క్రీన్-1
లవ్ మీ	: షిర్డిసాయి
హిట్ లిస్ట్	:పర్దిసాయి
రాజుయాదవ్	: వెంకటేశ్వర
బాక్	: శ్రీసత్య
భజే వాయు వేగం	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 263 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,300	5,250
రెండో రకం	3,900	4,450
మూడో రకం	3,500	4,030

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 37 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-26 యూనిట్లు, ఓ పాజిటివ్-5 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 304 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 198 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

- మండలంలో 5,400 ఎకరాల్లో వరి సాగు అంచనా
- గతేడాది వరి సాగు విస్తీర్ణం 5,230 ఎకరాలు
- ఇప్పటికే పొలాల్లో పచ్చిరొట్ట ఎరువుల సాగు
- 5 నుంచి ఆర్బీకేల్లో వరి విత్తనాల పంపిణీ

ఖరీఫ్ సీజన్లో వరి సాగుకు అనకాపల్లి మండల రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే తొలకరి పలకరించిన చోట పచ్చిరొట్ట విత్తనాలు వేశారు. మిగిలిన చోట్ల వేసవి దుక్కులు ముమ్మరంగా చేపట్టారు. ఈ ఏడాది 5,400 ఎకరాల్లో వరి సాగు లక్ష్యంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వర్షాలు మరింతగా అనుకూలిస్తే మరో 400 ఎకరాలు పెరగవచ్చని అధికారుల అంచనా.



వెంకుపాలెం గ్రామంలో పొలం దున్నుతున్న రైతు

అనకాపల్లి: మండలంలో వరి సాగుకు వీలుగా రైతులు వ్యవసాయ క్షేత్రాలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే పలు చోట్ల ఆర్బీకేల ద్వారా రాయితీపై కొనుగోలు చేసిన పచ్చిరొట్ట విత్తనాలను వేశారు. అందుబాటులో ఉన్న సమాచారం మేరకు ప్రస్తుతం 3,600 ఎకరాల్లో దుక్కులు పూర్తయి, పచ్చిరొట్ట ఎరువు సాగు చేస్తున్నారు. మరో 30-40 రోజుల్లో వీటిని నేలలో కలియదున్ని వరి సాగుకు సమాయత్తం చేయనున్నారు.

5,400 ఎకరాల్లో వరి సాగు లక్ష్యం

మండల పరిధిలో వెంకుపాలెం, తగరంపూడి, మార్టూరు, తుమ్మపాల, కుంచంగి, పిసినికాడ, ఊడేరు, బవులవాడ, మామిడిపాలెం ప్రాంతాల్లో వరి పంట ఎక్కువగా సాగు చేస్తారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు అనకాపల్లి మండలంలో 5,400 ఎకరాల్లో వరి సాగు లక్ష్యంగా అధికారులు పేర్కొంటున్నారు. వాతావరణం అనుకూలించి, వర్షాలు బాగా కురిస్తే సాగు విస్తీర్ణం 5,800 ఎకరాలకు చేరే అవకాశం ఉందని చెప్తున్నారు. వర్షాధారం కాకుండా, బోర్లు ఉన్న చోట ముందుగానే వరి నారు మడులు సిద్ధం చేస్తున్నారు. గతేడాది 5,230 ఎకరాల్లో వరి సాగు జరిగింది. ఇప్పటికే చాలా వరకు రైతులు తమకు కావాల్సిన వరి విత్తనాల కోసం సమీప రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)ల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

వెయ్యి క్వింటాళ్లకు పైగా విత్తనాలు

ఖరీఫ్ సాగుకు అవసరమైన విత్తనాల్లో తొలి విడత ఇప్పటికే ఆర్బీకేలకు చేరాయి. అందులో ఆర్‌జీఎల్ 2537 రకం 950 క్వింటాళ్లు, బీపీటీ 5204 రకం 50 క్వింటాళ్లతో పాటు ఎంటీయూ 1061, 1064, 1318, 1224 రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. మండల పరిధిలోని 25 ఆర్బీకేలకు వీటిని పంపిణీ చేస్తున్నారు. ఈ నెల 5 నుంచి ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు వీటిని పంపిణీ చేయనున్నారు. బోర్లున్న చోట ముందుగానే నారు మడులు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. వీరికి తొలి విడతలో విత్తనాలు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మూడెకరాల్లో వరి సాగు



పొలంలో దుక్కి దున్ని పచ్చిరొట్ట విత్తనాలు వేశాం. గత ఏడాది భూసార పరీక్షలు చేయించాను. వరి సాగు ద్వారా మంచి ఫలితం సాధించా. ఆర్బీకేలు లేనప్పుడు పట్టణంలో ప్రైవేట్ వర్తకుల వద్దకు వెళ్లి విత్తనాలు తెచ్చుకునేవాళ్లం. ప్రభుత్వం వ్యవసాయ బోరు వేసింది. 20 రోజుల తర్వాత వరి ఆకుమడులు వేసేందుకు పొలాల్ని సిద్ధం చేశాం.

– లెక్కల జగదీశ్వరరావు, రైతు, వెంకుపాలెం

విత్తనాల సరఫరాకు ఏర్పాట్లు



నేలను సారవంతం చేసే పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందించాం. రైతులు దుక్కులు పూర్తి చేసి, సాగుచేస్తున్నారు. ఆర్బీకేలకు విత్తనాలు చేరాయి. ఈ నెల 5వ తేదీ నుంచి రైతులకు అందిస్తాం. గత ఏడాదికంటే ఈసారి వరి సాగు ఎక్కువగా జరిగేలా రైతులకు అవగాహన కల్పించాం. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

– పీబీ రంగాచారి, మండల వ్యవసాయ అధికారి

క్షణికావేశంతో జీవితాల్ని బలి చేసుకోవద్దు



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి రమేష్

అనకాపల్లి: క్షణికావేశంలో చేసిన తప్పుల కారణంగా కొంత మంది జైలు జీవితం గడపాల్సి వస్తుందని 11వ అదనపు మెట్రోపాలిటన్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి రమేష్ తెలిపారు. స్థానిక సబ్ జైల్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్ష అనుభవించి, బయటికి వెళ్లాక సత్ప్రవర్తనతో మెలగాలని ఖైదీలకు సూచించారు. ముందుగా జైల్లో కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా న్యాయ సహాయం కావాలంటే కోర్టు దృష్టికి తీసుకురావాలన్నారు. తెలిసి ఎవరూ తప్పు చేయకూడదన్నారు. ఇలా చేస్తే వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబం రోడ్డున పడుతుందన్నారు. అనంతరం ఖైదీలకు అందిస్తున్న ఆహార నాణ్యతను, పడక గదులను పరిశీలించారు. ఆయన వెంట జైలు సూపరింటెండెంట్ గణేష్‌రెడ్డి, న్యాయవాదులు సాయిరాం, తులసి, రోజా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెరుకు సాగుతో లాభాలు



రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న అసిస్టెంట్ రీజనల్ డైరెక్టర్ జగన్నాథరావు తదితరులు

సబ్బవరం: చెరుకుకు మరింత డిమాండ్ పెరిగే అవకాశం ఉండడంతో రైతులు తమ సాగు విస్తీర్ణం పెంచుకొని లాభాలు గడించాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అసిస్టెంట్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు తెలిపారు. సబ్బవరం జాగృతి సొసైటీ కేంద్రంలో శుక్రవారం అనకాపల్లి ప్రాంతీ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో అఖిల భారత సమన్వయ పథకం ద్వారా షెడ్యూల్ కుల చెరుకు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చెరుకు సాగుకు మేలైన రకాలు ఎంపిక చేసుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. బెల్లం తయారీకి అనువైన సాగు రకాల గురించి వివరించారు.చెరుకును ఆశించే తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు.అనంతరం చెరుకు సాగు చేస్తున్న రైతులకు 15 బస్తాల యూరియా,సూపర్ పాస్ఫేట్ బ్యాగ్-1, వర్మీ కంపోస్టు బ్యాగ్‌లు-10, స్ప్రేయర్స్-5,స్టీల్ బకెట్లు -10,బెల్లం అచ్చులు, మందులు కలుపుకోవడానికి 10 డ్రమ్ములు అందజేశారు. కార్యక్రమంలో జాగృతి మేనేజింగ్ డైరెక్టర్ కందర్ప సుజాత, ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఆదిలక్ష్మి,విశాలాక్షి,సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ చంద్రశేఖర్, జాగృతి కన్సల్టెంట్ వీవీ సుబ్రహ్మణ్యం, జాగృతి సీఈవో కేఎల్ఎన్ మౌక్తిక,రైతు ఉత్పత్తిదారుల సంఘాల సీఈవోలు,ఫీల్డ్ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

టెన్త్ మెరిట్ విద్యార్థులకు రెడ్డీస్ ఫౌండేషన్ ప్రోత్సాహం



పదిలో మెరిట్ సాధించిన విద్యార్థులతో తోటాడ హైస్కూల్ హెచ్‌ఎం కుమార్

మునగపాక: చదువులో ఏకాగ్రత చూపడం ద్వారా ఉజ్వల భవిష్యత్ సాధ్యమని తోటాడ హైస్కూల్ హెచ్‌ఎం కుమార్ తెలిపారు. పదిలో మంచి ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థుల ఇంటర్ చదువుకు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రోత్సాహం అందించింది. ఈ మేరకు శుక్రవారం సంబంధిత విద్యార్థులు లావేటి హాసిని, ఆడారి వేణుశ్రీ, యల్లపు శ్యామలను ఆయన అభినందించారు. వీరికి భీమిలి బీచ్‌రోడ్డులోని తిమ్మాపురం దరి విజ్ఞాన్ వరల్డ్ వన్ విద్యా సంస్థలో రెండేళ్ల పాటు ఇంటర్ చదువుకు అవసరమైన మొత్తాన్ని ఫౌండేషన్ అందిస్తుందన్నారు. ఇందుకు రెడ్డీస్ ఫౌండేషన్ ఒక్కో విద్యార్థి రూ.2.86 లక్షల మేర ఫీజులు, ఇతర వసతులకు సాయం అందించేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు.

3న 'పరస' శత జయంతి వేడుకలు

అనకాపల్లి: సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ పరస సత్యనారాయణ శత జయంతి వేడుకలు ఈ నెల 3న స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాధారణ కార్మికుడి స్థాయి నుంచి సింగరేణి బొగ్గు గనులలో కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసి, కార్మిక హక్కుల కోసం పోరాడారని కొనియాడారు. ప్రభుత్వ, నైజాం రాజుల నిర్బంధాలను ఎదుర్కొని, కార్మిక నేతగా, శాసన సభ్యుడిగా ప్రజా సమస్యలపై పోరాడిన సత్యనారాయణ జయంతి వేడుకల్లో అన్ని వర్గాల కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు



అప్పారావును ఘనంగా సన్మానిస్తున్న శివాజీరాజు, తదితరులు

కె.కోటపాడు: అంకిత భావంతో పనిచేసిన ఉద్యోగులకు ఎల్లప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందని ఎంఈవోలు సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం చౌడువాడ హైస్కూల్ హెచ్‌ఎం ఈర్లె అప్పారావు ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా అభినందన కార్యక్రమంలో అప్పారావు సేవలను ప్రశంసించారు.

44 ఏళ్ల పాటు ఎంతోమంది విద్యార్థుల ఉన్నతికి కృషి చేశారన్నారు. అనంతరం అప్పారావు మాస్టారును వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, రిటైర్డ్ ఎంఈవో దాట్ల చంద్రశేఖర్ వర్మ, కింతాడ, కొత్తపెంట సర్పంచ్‌లు బండారు ముత్యాలనాయుడు, నీలిమా వెంకటరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఆకుల సాయిప్రసాద్, మాజీ సర్పంచ్ బొయిదాపు జగదీశ్వరరావు, దాట్ల రవిబాబు, బొడ్డు దేముడుబాబు, వంటాకు గోవిందరావు, వంటాకు రాముునాయుడు తదితరులు దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు.

'ఉపాధి' బడ్జెట్ పెంచాలి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న రైతు సంఘం నేతలు

అచ్యుతాపురం: గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్రం బడ్జెట్‌ను పెంచి కూలీలకు మౌలిక సదుపాయాలకు కల్పించాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. అచ్యుతాపురం మండలంలోని పెదపాడులో పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించి, రోజు కూలి పెంపుతోపాటు, సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం ప్రతినిధులు కర్రి అప్పారావు, ఆర్.రాము, శ్రీనివాసరావు, తిరుపతమ్మ, కోదండమ్మ, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాతవరం కళాశాలలో చేరాలంటూ ప్రచారం



కారులో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

నాతవరం: స్థానిక హైస్కూల్‌లో ఈ ఏడాది నుంచి ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహిస్తామని హెచ్‌ఎం ఎస్.శాంతికుమారి తెలిపారు. నాతవరం హైస్కూల్‌ను ప్రభుత్వం ఇటీవల కళాశాలగా అప్‌గ్రేడ్ చేసిందన్నారు. పదో తగరతి పాసైన విద్యార్థులంతా చేరాలంటూ శుక్రవారం ఉపాధ్యాయులతో కలిసి ప్రత్యేక వాహనంలో మండల వ్యాప్తంగా ప్రచారం నిర్వహించారు. ప్రథమ సంవత్సరం ఇంటర్ బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో అడ్మిషన్లు పొందాలన్నారు. కాలేజీ నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు హైస్కూల్ భవనంలోనే సమకూర్చామన్నారు. డి.యర్రవరం, గునుపూడి, తాండవ, చమ్మచింత, మన్యపురట్ల, ఎం.బి.పట్నం, నాతవరం హైస్కూళ్లలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించారు. ఇతర వివరాలకు నాతవరం హైస్కూల్‌ను సంప్రదించాలన్నారు.

లోక్ అదాలత్ విజయవంతం చేయండి

అదనపు జూనియర్ సివిల్ జడ్జి సూర్యకళ



మాట్లాడుతున్న అదనపు జూనియర్ సివిల్ జడ్జి



హాజరైన పోలీసు సిబ్బంది

చోడవరం రూరల్: వచ్చే నెలలో 29న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అపరిష్కృత కేసులకు ఇరు వర్గాల సమ్మతితో పరిష్కారం చూపాలని చోడవరం అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.సూర్యకళ తెలిపారు. శుక్రవారం స్థానిక కోర్టు హాలులో పోలీసు వర్గాలతో ఆమె అవగాహన సమావేశం నిర్వహించారు. స్థానిక కోర్టుల పరిధిలో ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోకుండా అటు కక్షిదారులు ఇటు కోర్టు, పోలీసు, న్యాయవాద వర్గాల విలువైన కాలం వృథా అవుతున్నందున ఆయా కేసులను గుర్తించాలని సూచించారు. వాటిలో ఇరువర్గాల కక్షిదారులను సమీకరించి ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని కనుగొనడానికి కృషి చేయాలన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కరింపబడే కేసులకు వర్తించే ప్రయోజనాలను వివరించాలన్నారు. కోర్టులో ఎప్పటికో లభించే తీర్పు వల్ల కలిగే ఉపశమనం కన్నా లోక్ అదాలత్ తీర్పునకు అదనపు లబ్ధిని వారికి వివరించి సంబంధిత కేసులను పరిష్కరించాలని సూచించారు. దీని కోసం తమ తమ పరిధిలో కేసులను ముందుగా గుర్తించి సంబంధిత కక్షిదారులతో సంప్రదింపులు చేసి అధిక సంఖ్యలో విముక్తి కలిగించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోర్టు క్లర్క్ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు వినియోగంతో అనర్థాలు



పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

అచ్యుతాపురం: ధూమపానం, మద్యపానం, మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని హరిపాలెం పీహెచ్‌సీ వైద్యురాలు కల్యాణి అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

గోరుముద్ద.. మరింత నాణ్యత, రుచికరం

- ఎండీఎం నిర్వాహకులకు అవగాహన
- మెనూ ప్రకారం వండించి రుచి చూసిన అధికారులు



విద్యార్థులకు పెట్టే మెనూ పదార్థాలు వండిన నిర్వాహకులు



నిర్వాహకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో నరేష్

నక్కపల్లి: మరో పది రోజుల్లో పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. పాఠశాలల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని మరింత నాణ్యతగా, రుచికరంగా పిల్లలకు అందించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం మండలంలోని మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం) నిర్వాహకులతో ఎంఈవో కుంచం నరేష్, జగనన్న గోరుముద్ద పథకం పర్యవేక్షకుడు శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి గోరుముద్ద పథకాన్ని మరింత నాణ్యతగా, పోషక విలువలతో కూడి రుచికరంగా ఉండేలా మెనూలో మరిన్ని పదార్థాలు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మెనూ తయారీలో ఎలాంటి రాజీ లేదన్నారు. మెనూ మేరకు పదార్థాలు తయారు చేయాల్సిందేనన్నారు. తమ ఇంట్లో కంటే పాఠశాలల్లోనే రుచికరమైన పౌష్టికాహారం అందుతోందన్న అనుభూతి విద్యార్థుల్లో కలగాలన్నారు. మెనూ పదార్థాల తయారీ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జగనన్న గోరుముద్దను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్వాహకులు తయారు చేసిన పదార్థాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు చదువుతోపాటు ఆరోగ్యం కూడ ముఖ్యమన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో నోడల్ ఉపాధ్యాయులు వేమగిరి నూకరాజు, మూర్తిరాజు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా, రుచిగా ఉండాలని ఎంఈవో మూర్తి అన్నారు. శుక్రవారం ఆయన నిర్వాహకులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలన్నారు. ఐఎఫ్‌పీ ద్వారా మెనూను ప్రదర్శించారు. గ్యాస్‌స్టవ్‌పై పదార్థాలు తయారు చేసి ప్రదర్శించారు. అధికారులు వాటిని రుచి చూశారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ శేషుకుమార్ పాల్గొన్నారు.

మెనూ పదార్థాలు

సోమవారం	హాట్ పొంగల్/ వెజిటబుల్ రైస్, ఎగ్ కర్రీ
మంగళవారం	పులిహోర, దొండకాయ పచ్చడి, ఉడికించినగుడ్డు
బుధవారం	వెజిటబుల్ రైస్, ఆలూ కుర్మా, చిక్కీ, ఉడికించిన గుడ్డు
గురువారం	సాంబార్ రైస్/పులిహోర, టమాటా చట్నీ, ఉడికించినగుడ్డు
శుక్రవారం	అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ
శనివారం	ఆకుకూర రైస్, స్వీట్ పొంగల్

ఏలేరు కాలువలో నాచు, గడ్డి తొలగింపు



పొక్లెయిన్ సాయంతో నాచు, గడ్డి తొలగింపు

మాకవరపాలెం: ఏలేరు కాలువలో జంగిల్ క్లియరెన్స్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలోని వజ్రగడ, దాలింపేట, కొండలఅగ్రహారం, పైడిపాల, లచ్చన్నపాలెం, మాకవరపాలెం, తామరం, రాచపల్లి, రామన్నపాలెం, శెట్టిపాలెం గ్రామాల సమీపంలో ఏలేరు కాలువ ఉంది. ఈ కాలువలో గట్లకు ఇరువైపులా జంగిల్‌తోపాటు గుర్రపుడెక్క, నాచు, గడ్డి అధికంగా పేరుకుపోయాయి. ఇవి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. నీటి సరఫరా లక్ష్యం కూడా చేరకపోవడాన్ని గుర్తించిన అధికారులు ప్రస్తుతం కొండలఅగ్రహారం వద్ద వాటిని తొలగించే పనులు చేపట్టారు. ఈ పనులు పూర్తయితే విశాఖ ప్రజలకు తాగునీరు, స్టీల్ ప్లాంట్ అవసరాలకు ఆశించిన స్థాయిలో నీరు అందుతుందని జీవీఎంసీ అధికారులు తెలిపారు.